కరువు తెచ్చిన ఉపాయం

- సాగునీరు అందక రైతుల కష్టాలు
- నీరు తగ్గి.. చిన్నబోయిన బోర్లు
- నీటి గుంతలతో కూరగాయల సాగు


గుంత ద్వారా వచ్చిన నీరు తోటకు పారపెడుతున్న రైతు


పొలంలో ఏర్పాటు చేసిన నీటిగుంత

మరికల్: పదేళ్ల తర్వాత కరువు చాయలు అలుముకోవడంతో రైతులు సాగు చేసిన వరితో పాటు కూరగాయల తోటలను కాపాడుకోవడం కోసం ప్రత్యమ్నాయ మార్గాలను ఎంచుకుంటున్నారు. ఒక్కో రైతు తనకు తోచిన విధంగా బోరులో నుంచి వచ్చే కొద్దిపాటి నీరును పొదుపుగా వాడుకుంటూ తోటలను కాపాడుకుంటున్నారు. కాపు వచ్చిన కూరగాయలను తీస్తూ వివిధ పట్టణాలోని వారం తపు సంతాలకు తరలిస్తున్నారు.

కూరగాయలే వీరి జీవనాధారం..

మండలంలోని అప్పంపల్లికి కూరగాయల సాగుకు పెట్టింది పేరు. ఇక్కడ దశాబ్దాల నుంచి రైతులు కూరగాయల తోటలను సాగు చేస్తున్నారు. గతేడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా వేసవిలో మండుతున్న ఎండలకు వ్యవసాయ బోర్లలో నీటి మట్టం తగ్గడంతో తోటలను, పంటలను ఎలా కాపాడుకోవాలనే ఆలోచనతో ముందుకు సాగారు. ఇదే గ్రామానికి చెందిన నారాయణ ఎకర భూమిలో వివిధ రకాల కూరగాయల సాగు చేశాడు. ఎండలకు బోరులో నీటిమట్టం తగ్గి కొద్దిగా వచ్చే నీటిని పొదుపుగా వాడుకునేందుకు పొలంలోనే నీటిగుంతను ఏర్పాటు చేశారు. బోరు నుంచి నేరుగా గుంతను నింపి అక్కడి నుంచి ఎక్కువ మొత్తంలో వచ్చే నీటితో మూడు రోజులకు ఒకసారి ఎకరా తోటకు సాగునీరు పెడుతూ కాపాడుకుంటున్నాడు. ఈ రైతును ఆదర్శంగా తీసుకున్న మరికొందరు రైతులు కూడా ఇలాగే నీటి గుంతలను ఏర్పాటు చేసుకుని కరువు నుంచి కొద్దిమేర కూరగాయల తోటలను, వరి పంటలను కాపాడుకుంటూ నష్టాలను తగ్గించుకుంటున్నారు.


బకెట్‌తో నీరు పడుతున్న మహిళ రైతు

నీటిగుంత బతికిస్తోంది



ఎండల ప్రభావంతో బోర్లలో నీళ్లు తగ్గాయి. ఎకరా భూమిలో బెండ, టామట, చిక్కుడ, బీరకాయ, వంకాయతో పాటు వివిధ ఆకు, కూరగాయలను సాగు చేశాను. ఇందుకు రూ. 40 వేల పెట్టుబడి అయ్యింది. నీళ్లు లేక బీరతోటను తొలగించాను. మిగితా తోటలను కాపాడుకోవడం కోసం పొలంలోనే నీటిగుంతను ఏర్పాటు చేశాను. ప్రతి మూడు రోజులకు ఒక్కసారి నీటిగుంత నిండుతోంది. అప్పుడే తోటకు నీళ్ల పెడుతున్నాను. ఈ కరువు పరిస్థితుల్లో కనీసం పెట్టుబడి వరకైన వస్తే చాలు అనుకొని పని చేస్తున్నాం. – నారాయణ, కూరగాయల రైతు, అప్పంపల్లి

బకెట్‌తో నీరందిస్తున్నా..



అర ఎకర పొలంలో కూరగాయల సాగు చేశాను. ఇందుకు రూ.20 వేలు ఖర్చు చేశాను. ఎండల తీవ్రత కారణంగా బోరు నుంచి వచ్చే కొద్దిపాటి నీరుతో వరిపంటకు వదులుతున్నాం. బిందెలు, బకెట్లతో నీళ్లు తెచ్చి కూరగాయల తోటలకు పోస్తున్నాను. ఇలా నెల రోజుల నుంచి నీళ్లు పోయడంతో బెండతోట కాపు వచ్చింది. ఎండల ప్రభావం ఎక్కువగా ఉండటం వల్ల టామట ఎదుగుదల లేకపోవడం బాధగా ఉంది. – అంజమ్మ, అప్పంపల్లి

క్లుప్తంగా

రాజీనామా ఉపసంహరణ

కృష్ణా: బీజేపీ కేంద్ర కార్యవర్గ సభ్యుడు అమర్‌కుమార్ దీక్షిత్ పార్టీ పదవికి చేసిన రాజీనామను ఉప సంహరించుకున్నట్లు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.. ఇటీవల మండల కేంద్రంలో ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలపడం లేదని, అందుకు కేంద్ర మంత్రులకు ఎన్నిమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని మన స్తాపానికి గురై పార్టీ పదవికి, నామినేటేడ్ పదవి ఫిల్మ్ సెన్సార్ బోర్డు మెంబర్ పదవికి రాజీనమా చేసినట్లు తెలిపారు. బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి డీకే అరుణ త్వరలోనే రైళ్ల నిలుపుటకు తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో తాను ఉపసంహరించుకున్నట్లు తెలిపారు.

ధైర్యంగా ఓటు హక్కు వినియోగించుకోండి

మాగనూర్: ప్రజలలో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించేందుకే, శాంతియుత వాతావరణంలో లోక్ సభ ఎన్నికలను నిర్వహించడానికి జిల్లా పోలీసులు, కేంద్ర సాయుధ బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ అబ్దుల్‌ఖాదర్ తెలిపారు. సోమవారం సాయంత్రం ఉజ్జీల్లి, బైరంపల్లి గ్రామంలో పోలీసులు, కేంద్ర సాయుధ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధైర్యంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

నేడు బండలాగుడు పోటీలు ప్రారంభం

నర్వ: మండల కేంద్రంలో ఉగాది పండుగను పురస్కరించుకుని అంతర్రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీలను సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు, యువకులు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆలయాల్లో అమావాస్య పూజలు

నారాయణపేట రూరల్: జిల్లా వ్యాప్తంగా శైవక్షేత్రాలలో సోమవారం అమావాస్య పూజలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్రాల సరిహద్దులోని కాలబెలగుంది క్షేత్రంలో స్వామివారికి సుప్రభాతం, రుద్రాభిషేకం, బిల్వార్చన, అష్టోత్తరనామావళి, అభిషేకం, అలంకరణ, హారతి తదితర పూజలు నిర్వహించారు. భక్తులకు సర్వదర్శనం కల్పించి అన్నదానం చేపట్టారు. అదేవిధంగా పట్టణంలోని అయ్యప్ప స్వామి, సింగార్‌బేస్ శివలింగేశ్వర స్వామి దేవాలయం, మహంకాళివీధి శివాలయం, తాయమ్మగుడితో పాటు మండలంలోని ఎక్లాస్‌పూర్ తిమ్మప్ప ఆలయం, జిలాల్‌పూర్ కర్రె ప్పతాత గుడిలో ప్రత్యేక పూజలు చేసి భక్తులకు అన్నదానం చేపట్టారు.

రేషన్ బియ్యం స్వాధీనం

కోస్గి: రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నారనే పక్కా సమాచారంతో పోలీసులు దాడులు చేసి పట్టుకున్నారు. హకంపేటలో ఆటోలో ఆదివారం రాత్రి లోడ్ చేసిన బియ్యంతో వెళ్తున్న వాహనాన్ని స్థానిక పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడిన వాహనంలో 3 క్వింటాళ్ల బియ్యం ఉన్నట్లు నిర్ధారించారు. పట్టుబడిన బియ్యాన్ని స్థానిక ఎంఎల్ఎస్ పాయింట్‌లో అప్పగించి ధ్రువీకరణ తీసుకున్నట్లు ఎస్ఐ శేఖర్ గౌడ్ తెలిపారు. పట్టుబడిన వాహనాన్ని సీజ్ చేసి యజమానిపై కేసు నమోదు చేశామన్నారు.

నర్వ: మండంలోని బెక్కరపల్లిలో ఆదివారం రాత్రి ఏరుకలి రాము ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన 24 సంచుల బియ్యం స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కురుమయ్య తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మాగనూర్: మండలంలోని అడవిసత్యారం పెద్దవాగు నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అబ్దుల్‌ఖాదర్ తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ.. నరసింహులు తన తన ట్రాక్టర్‌లో అనుమతి లేకుండా ఇసుక నింపుతుండగా డయల్ 100 సిబ్బంది రాజశేఖర్‌రెడ్డి అటుగా వెళ్తుండగా ట్రాక్టర్‌ను గుర్తించి పట్టుకుని అనుమతిపత్రాలు అడుగగా లేకపోవడంతో స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. అనుమతి లేకుండా ఇసుక రవాణాకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

త్రైత సిద్ధాంత అనుబంధ గ్రంథాల ప్రచారం



మాగనూరు: తెలుగు కొత్త సంవత్సరం ప్రారంభాన్ని పురస్కరించుకుని త్రైత సిద్ధాంతం–ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం, త్రైత సిద్ధాంత అనుబంధ గ్రంథాలను సోమవారం ప్రచారం చేశారు. కార్యక్రమంలో కృష్ణయ్య, తిరుపతయ్య, గోపాల్, సుధాకర్, బాలనరసింహులు పాల్గొన్నారు.

సభలో సమస్యల ఏకరువు


మాట్లాడుతున్న వ్యవసాయశాఖ అధికారి

నారాయణపేట రూరల్: మండల సమావేశం సాదాసీదాగా కొనసాగింది. ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన ప్రారంభమైన సమావేశానికి తొలిసారి ప్రత్యేక అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు ఎంపీటీసీ సభ్యులు వారి పరిధిలోని సమస్యలను ఏకరువు పెట్టారు. ఎక్లాస్‌పూర్, కొల్లంపల్లి, జాజాపూర్‌లో నెలకొన్న తాగునీటి సమస్య తీర్చాలని, పైపులైన్ కోసం రోడ్డును తవ్వి మధ్యలో వదిలేశారని, వెంటనే పనులు పూర్తి చేయాలని కోరారు. బైరంకొండ, కొల్లంపల్లిలో ఏళ్ల తరబడి ఉన్న ఇనుప స్తంభాలను తొలగించాలని, వర్షాకాలంలో ప్రమాదాలకు కారణమవుతున్నాయని ట్రాన్స్‌కో ఏఈతో వాపోయారు. రైతులు వడ్లు అమ్మడానికి వెళ్తే తరుగు ఇష్టారీతిగా తీయడంతో నష్టపెతున్నారని ఐకేపీ అధికారితో చెప్పారు. ఎండాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ఆశావర్కర్లు, వైద్య సిబ్బంది గ్రామాల్లో అవగాహన కల్పిస్తూ ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకుని పంపిణీ చేయాలన్నారు. ఐసీడీఎస్ అధికారులు సమాచారం లేకుండా గ్రామాల్లో పర్యటించడం సరికాదని, గతంలో ఎన్నిసార్లు చెప్పిన తీరు మారడంలేదని ప్రశ్నించారు. మరోసారి పునరావృతం అయితే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. కల్యాణలక్ష్మి పంపిణీ వెంటనే ప్రారంభించాలని కోరగా ఎన్నికల కోడ్ అనంతరం జరుగుతుందని డిప్యూటీ తహసీల్దార్ సమాధానం ఇచ్చారు. ఆర్అండ్‌బీ, ఎడ్యుకేషన్, ఐబీ, ఫారెస్ట్ తదితర శాఖల అధికారులు గైర్హాజరు కావడంతో మండిపడ్డారు. సమావేశంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, సూపరింటెండెంట్ శోభారాణి, ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు


వినాయకుడి పాటకు నృత్యం చేస్తున్న విద్యార్థులు

మరికల్: మండల కేంద్రంలో రెండు రోజుల పాటు జరిగిన ప్రతిభ హైస్కూల్ వార్షికోత్సవంలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమలు ఆకట్టుకున్నాయి. సోమవారం రాత్రి విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ హన్మంతురెడ్డి, ప్రిన్సిపాల్ తమిల్‌రైన్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

వెంకటయ్యకు డాక్టరేట్



కోస్గి: ఉమ్మడి పాలమూర్ జిల్లాలో పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ జిల్లా పరిషత్‌లో జిల్లా శిక్షణ మేనేజర్‌గా పని చేస్తున్న గుండుమాల్‌కు చెందిన వెంకటయ్యకు గ్లోబల్ యూనివర్సిటీ ఆఫ్ బోస్టన్ అమెరికా వారు డాక్టరేట్ ప్రదానం చేశారు. ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగంలో ఈ డాక్టరేట్ ప్రదానం చేసినట్లు ఆయన తెలిపారు. 25 ఏళ్ల నుంచి ప్రజాప్రతినిధులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తూ సేవలు అందించారు. ఆదివారం గోవాలో జరిగిన కార్యక్రమంలో డాక్టరేట్ ఇచ్చి సత్కరించారు.

వాటర్‌ఫిల్టర్ బహూకరణ

నారాయణపేట రూరల్: మండలంలోని బైరంకొండ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు యూడబ్ల్యూహెచ్ దాతల సహకారంతో సోమవారం వాటర్ ఫిల్టర్‌ను బహూకరించారు. కార్యక్రమంలో విద్యావతి, మహేష్, స్నేహలత, గీత, అశోక్, పద్మావతి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నారాయణపేట రూరల్: పట్టణంలోని ఎయిడేడ్ వైదికోన్నత పాఠశాలలో 2013–14లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఒక్క చోట కలుసుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం తాము చదువుకున్న స్కూల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. తమకు విద్యాబోధన చేసిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో టీచర్లు వెంకట్రాములు, అర్చన, భారతమ్మ, పార్వతమ్మ, సుజాత, నగేష్‌గౌడ్, గంగాధర్‌రెడ్డి, ఉదయ్‌కుమారి పాల్గొన్నారు.


గురువులను సన్మానిస్తున్న పూర్వవిద్యార్థులు

పాఠశాలలో వాటర్‌బెల్ ప్రారంభం


పాఠశాలలో నీరు తాగుతున్న విద్యార్థులు

ఊట్కూరు: మండలంలోని చిన్నపొర్ల ఉన్నత పాఠశాలలో సోమవారం ఎండలు తీవ్రంగా ఉన్న కారణంగా గైడ్ టీచర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో వాటర్‌బెల్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి హెచ్ఎం రాయల్‌హెన్న మాట్లాడుతూ ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున నీళ్లు ఎక్కువగా తాగాలన్నారు. జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు ఉన్న కారణంగా విద్యార్థులకు వేసవిలో తీసుకునే జాగ్రత్తలను సూచించినట్లు తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని రోజుకు మూడు సార్లు ఉదయం 8.45, 10.05, 11.50 గంటలకు వాటర్ బెల్ మోగించి విద్యార్థులకు నీరు తాగేందుకు సమయం ఇస్తున్నామని తెలిపారు.

అధ్వానంగా పేట–మక్తల్ రహదారి


మల్లేపల్లి స్టేజ వద్ద రోడ్డుపై గుంతలు

మరమ్మతులకు నోచుకోని వైనం

ఊట్కూర్: నారాయణపేట–మక్తల్ రహదారి దెబ్బతినడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురువుతున్నారు. రోడ్డుపై అడుగడుగున గుంతలు ఏర్పడడంతో రాత్రి వేళలో వాహనదారులు ప్రమాదాలకు గురువుతున్నారు. మక్తల్ నుంచి సింగారం చౌరస్తా వరకు 25 కి.మీ రహదారి ఉంది. నిత్యం వందలాది వాహనాలు వెళ్తుంటాయి. రాయచూర్, గద్వాల, నారాయణపేట, తాండూర్, కొడంగల్, గుల్బర్గ ఇతర పట్టణాలకు ప్రయాణిస్తుంటారు. లింగంపల్లిగేట్ నుంచి తిప్రాస్‌పల్లి వరకు 15 కి.మీ. రోడ్డుపై అడుగడుగున గుంతలు ఏర్పడ్డాయి. గత వర్షాకాలంలో గుంతల్లో వరదనీరు చేరడంతో రోడ్డు దెబ్బతింది. రోడ్డుపై అధికలోడ్‌తో వాహనాలు రాత్రివేళలో తిరుగుతున్నా, మైనింగ్ అధికారులు, ఆర్‌టీఓ అధికారులు తనిఖీలు చేపట్టలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. రోడ్డు మరమ్మతు చేపట్టాలని పలు మార్లు తెలిపిన ఆర్‌అండ్‌బీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు మరమ్మతు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.


ఊట్కూర్ శివారులో రోడ్డుపై గుంతలు


కొల్లూర్ స్టేజి సమీపంలో..

కూలీలకు టెంట్ల ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..

మాగనూర్: ఉపాధి హామీ పని ప్రదేశాల్లో ప్రభుత్వం కల్పించాల్సిన వసతులు ఎక్కడా కానరాకపోవడంతో ఆదివారం 'ఉపాధి పనుల్లో వసతులు కరువు' కథనం సాక్షి దినపత్రికలో ప్రచురితమైంది. స్పందించిన అధికారులు సోమవారం మండలంలోని ఆయా గ్రామాల్లో కూలీలకు అవసరమైన టెంట్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఏపీఓ హర్షవర్ధన్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఉన్నతాధికారుల ఆదేశాలతో ప్రతి గ్రామంలో కూలీలకు అవసరమైన వసతులను ఏర్పాటు చేస్తామని తెలిపారు.


నేరడగం శివారులో కూలీల కోసం ఏర్పాటు చేసిన టెంట్లు

పకడ్బందీగా 'ఉపాధి' పనులు చేపట్టాలి


మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ మయాంక్‌మిట్టల్

నర్వ: మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులు నిర్వహించాలని అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిట్టల్ అన్నారు. సోమవారం మండలంలోని ఉందేకోడ్‌లో ఉపాధిహామీ పనులను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. కూలీలకు తాగునీరుతో పాటు మెడికల్, టెంట్ల సౌకర్యం కల్పించాలని సూచించారు. వేసవిలో కూలీలకు పని కల్పించేలా ప్రణాళిక బద్ధంగా పనులు చేయించాలన్నారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు.

అందరూ సోదరభావంతో మెలగాలి


మక్తల్‌లో పండ్లు తినిపిస్తున్న ఎమ్మెల్యే శ్రీహరి


నారాయణపేటలో ఇఫ్తార్‌కు హాజరైన ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి

మక్తల్: అందరూ సోదరభావంతో కలిసి పండుగలను నిర్వహించుకోవాలని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. సోమవారం పట్టణంలో బురాన్‌గడ్డ నూర్ మసీద్ వద్ద కాంగ్రెస్ నాయకుడు మంజూర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌లో ఎమ్మెల్యే హాజరై, ప్రార్థనలు చేశారు. ఎమ్మెల్యే ముస్లింలకు పండ్లు తినిపించి, ఉపవాసదీక్షలను విరమింపజేశారు. కార్యక్రమంలో లక్ష్మారెడ్డి, బాలకృష్టారెడ్డి, వెంకటేష్, శంశోద్దీన్, నూరోద్దీన్, రహింపటేల్, ఫయాజ్, షేక్‌అన్వర్, వసీమ్, నయిమ్, అజీజ్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

'ఇఫ్తార్'లో ఎమ్మెల్యే, ఎస్పీ

నారాయణపేట రూరల్: రంజాన్ మాసం సందర్భంగా ఇఫ్తార్‌లో భాగంగా సోమవారం పట్టణంలోని రెండు వేర్వేరు చోట్ల జరిగిన విందుకు ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి నాయకులతో హాజరుకాగా, మరో చోట ఎస్పీ యోగేష్‌గౌతమ్ పోలీసు అధికారులతో హాజరయ్యారు. 20వ వార్డులో కాంగ్రెస్ పార్టీ నాయకుడు వెంకటేష్‌గౌడ్ ఇచ్చిన ఇఫ్తార్ విందులో పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా జామా మసీద్‌లో జరిగిన ఇఫ్తార్ విందులో ఎస్పీతో పాటు అడీషనల్ ఎస్పీ నాగేంద్రుడు, డీఎస్పీ లింగయ్య, మహేష్, సీఐ శివశంకర్, రామ్‌లాల్, ఎస్ఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. అంతకుముందు మసీదులో ప్రార్థనలు చేయగా, శాలువాతో సన్మానించారు. అనంతరం ఒకరినొకరు పండ్లు తినిపించుకుని శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులకు ఉగాది పచ్చడి పంపిణీ


సింగారం యూపీఎస్‌లో పచ్చడి తాగుతున్న విద్యార్థులు

నారాయణపేట రూరల్: విద్యాసంస్థల్లో ఒక రోజు ముందుగానే ఉగాది వేడుకలు నిర్వహించారు. పిల్లలకు పండుగ విశిష్ట తెలియజేయాలనే ఉద్దేశంతో పాఠశాలల్లో వేడుకను చేపట్టి పిల్లలకు పచ్చడి వితరణ చేశారు. పట్టణంలో, మండలంలోని బసిరెడ్డిపల్లి, సింగారం, ఊటకుంటతండా తదితర ప్రభుత్వ పాఠశాలలలో సోమవారం వేడుకలను నిర్వహించారు. ఆయా పాఠశాల నిర్వాహకుల ఆధ్వర్యంలో వివిధ రకాలైన వస్తువులతో పచ్చడి తయారీని పిల్లలకు నేర్పించారు. ఆంగ్ల సంవత్సరాదిని కాకుండా తెలుగు పండుగను కొత్త అడుగులకు నాందిగా స్వీకరించాలని సూచించారు.

విద్యార్థులకు ఉగాది పచ్చడి పంపిణీ

మరికల్: మండలంలోని తీలేర్ లిటిల్ స్టార్ స్కూల్ ప్రాంగణంలో సోమవారం ఏర్పాటు చేసిన పచ్చడి పంపిణీ కార్యక్రమంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల విద్యార్థులకు, గ్రామస్తులకు కరస్పాండెంట్ రాంచందర్‌గౌడ్ పచ్చడి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

నిలిచిన ధాన్యం కొనుగోలు


గోటూర్‌లో వరి ధాన్యం ఆరబెడుతున్న రైతులు

ధన్వాడ: వరి కొనుగోలు చేసేందుకు అధికారులు కేంద్రాలు ఏర్పాటు చేసినా, క్షేత్రస్థాయిలో కొనుగోళ్లు మాత్రం నేటికి ప్రారంభించలేదని రైతులు వాపోతున్నారు. మండలంలోని గోటూర్, గున్ముక్ల, ధన్వాడలో ప్రాథమిక వ్యవసాయ సహకర సంఘం పరిధిలో కొనుగోలు కేంద్రాలను ఈ నెల 1వ తేదీన ప్రారంభించారు. 9 రోజులు గడుస్తున్న కొనుగోలు చేయడం లేదు. రైతుల ధాన్యం ప్రస్తుతం చేతికొచ్చిందని, రోడ్లపై ఆరబెట్టుకుంటున్నామని రైతులు వాపోతున్నారు.

కాళికాదేవి ఉత్సవాలు ప్రారంభం


పల్లకీసేవలో పాల్గొన్న భక్తులు

ఊట్కూరు: మండల కేంద్రంలో ఉగాది అమావాస్య పురస్కరంచుకుని సోమవారం కాళికాదేవి ఉత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామ పురవీధుల్లో పల్లకీసేవ చేపట్టారు. కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

కవులు, కళాకారులు సమాజ మార్గదర్శకులు


బాలకేంద్రంలో కవులకు సన్మానం చేస్తున్న నిర్వాహకులు

నారాయణపేట రూరల్: తేనెలొలుకు తెలుగు భాషకు జీవం పోసి సంస్కృతి, సాంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందిస్తున్న కవులు, కళాకారులు నిజమైన సమాజ మార్గదర్శకులని తహసీల్దార్ రాణాప్రతాప్‌సింగ్, లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ హరినారాయణ్‌బట్టడ్ అన్నారు. పట్టణంలోని బాలకేంద్రం ఆవరణలో సోమవారం ఎస్పీ బాలు ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలను పురస్కరించుకుని నిర్వహించిన కవి సమ్మేళనంలో పలువురు కవులు హాజరై కవితలను వినిపించారు. అదే విధంగా కళాకారులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం కవులు, కళాకారులను శాలువా, జ్ఞాపికతో సత్కరించి పచ్చడి పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో బాలకేంద్రం సూపరింటెండెంట్ మహిపాల్‌రెడ్డి, కవులు రామ్మోహన్‌రావు, అవుటిమల్లేషం, చిన్నయ్య, శ్రీశైలం, సత్యనారాయణ, చంద్రశేఖర్, నర్సింహులు, బాలకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.